ప్రజాశక్తి
మంగళవారం 15 ఆగస్టు 2023
5
శ్రీకాకుళం



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలసకు చెందిన గేదెల హరికృష్ణ సంగమేశ్వర ఆలయం దిగువన వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

స్వాతంత్ర్య సమరంలో సిక్కోలు


ప్రజాశక్తి - శ్రీకాకుళం

బ్రిటిష్ వలస పాలన నుంచి భారతదేశం విముక్తి పొంది 76 ఏళ్లు అయింది. నాటి త్యాగధనులంతా దాదాపుగా కీర్తిశేషులయ్యారు. తరం మారింది. తీరు మారింది. ఫలితంగా నాటి త్యాగాలతో సాధించుకున్న రాజకీయ స్వాతంత్ర్యానికి నేడు ముప్పు ముంచుకొచ్చింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుంచి బయటపడిన భారతదేశం మళ్లీ ఇప్పుడు కార్పొరేట్, సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల్లోకి జారుకుంటోంది. నాటి వారసత్వ స్ఫూర్తితో మరో స్వాతంత్ర్యోద్యమానికి ముందుకు సాగే ప్రయత్నం చేస్తున్న శక్తులకు సంపూర్ణ సహకారం అందించాల్సిన సమయం ముందుకొచ్చింది. అలాంటి తరుణంలో నాడు జిల్లాలో సాగిన ప్రధాన ఘట్టాలను పాత్రధారులు, సూత్రధారులను స్మరించుకోవడం, నిరంతర కర్తవ్యంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. పింఛన్లు అందించేందుకు జాతీయోద్యమంలో కారాగార జీవితం అనుభవించిన వారి జాబితా మాత్రమే వెలుగుచూసింది. పోలీసుల నిర్బంధాలకు, చిత్రహింసలకు గురైన వారెందరో ఉన్నారు. ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి నేతల అజ్ఞాత జీవితాలకు సంపూర్ణ సహకారం అందించిన త్యాగధనుల కుటుంబాలు అనేకం ఉన్నాయి. జమిందారీ వ్యతిరేక పోరాటాలు రైతాంగ ఉద్యమాలు, జాతీయోద్యమంలో అంతర్భాగంగానే సాగాయి. సామాన్య ప్రజలను కదిలించాయి.

నేటి శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక భాగం ఒడిశాలోని గంజాం జిల్లాలో ఉండేది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని గంజాం జిల్లాలో ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి పాతపట్నం, నరసన్నపేట శ్రీకాకుళం తాలుకాలుండేవి. ఆ తర్వాత కొంతకాలం ఉత్తర విశాఖ జిల్లాలో చేరాయి. 1950 ఆగస్టు 15వ తేదీన ఉత్తర విశాఖ జిల్లా నుంచి వీడి శ్రీకాకుళం కేంద్రంగా కొత్త జిల్లాగా ఏర్పడింది. 1979లో విజయనగరం జిల్లా ఆవిర్భావంతో, 2022లో జిల్లాల పునర్విభజనతో శ్రీకాకుళం జిల్లా భౌగోళిక స్వరూపం మరోసారి మారిపోయింది.


1905 విదేశీ వస్త్ర బహిష్కరణకు పిలుపురావడంతో జిల్లాలోని పలు పట్టణాల్లో ప్రధానంగా నాటి తాలుకా కేంద్రాల్లో ప్రజలు తమ ఇళ్లల్లో ఉన్న విదేశీ బట్టలను రోడ్డుపై తగులబెట్టారు. విదేశీ వస్త్ర బహిష్కరణ పిలుపు అమలు చేసిన వందలాది మందిపై బ్రిటీష్ పాలకులు కేసులు పెట్టి అరెస్టు చేశారు. జైళ్లలో పెట్టారు. ఆ కాలంలోనే స్వదేశీ వస్త్ర వినియోగం పిలుపుతోనే ఖాదీల బట్ట తయారీ ఒక ఉద్యమంలా సాగింది. పొందూరు, బొంతల కోడూరు, మెళియాపుట్టి, నరసన్నపేట, బుడితి, సోంపేట, తదితర ప్రాంతాల్లో ఖాదీ బట్ట ఉత్పత్తి, విశేష ఆదరణ కనిపించింది.

జాతీయోద్యమ నాయకత్వం పిలుపునకు జిల్లా నుంచి మంచి స్పందన వచ్చింది. చదువులే కాదు ఉద్యోగాలు వదిలి వచ్చిన వారూ ఉన్నారు. అటువంటి వారిలో ఇచ్ఛాపురం నుంచి పుల్లెల శ్యామసుందరరావు, టెక్కలి నుంచి అట్టాడ కృష్ణమూర్తి, శ్రీకాకుళం నుంచి పూడిపెద్ద వెంకటరావు, మెళియాపుట్టి నుంచి దుక్క రాజన్నరెడ్డి, నరసన్నపేట నుంచి గరిమెళ్ల సత్యనారాయణ తదితరులున్నారు. గరిమెళ్ల సత్యనారాయణ రచించిన మాకొద్దీ తెల్లదొరతనమూ... గీతం ఆ రోజుల్లోనే ప్రాచుర్యం పొందింది. ప్రజల నోట వినిపించింది. 1927లో హరిజనోద్ధరణ పిలుపుతో జిల్లాలో గాంధీజీ పర్యటించారు. బొంతల కోడూరులో తయారవుతున్న సన్నఖాదీ బట్టను పరిశీలించారు. తిలారు, సారవకోట, పర్లాకిమిడి, మెళియాపుట్టి, పూండీ, పలాస, ఇచ్ఛాపురంలో పర్యటించారు.


దూసిలో రైలు నుంచి దిగుతున్న గాంధీ (ఫైల్)

ఉప్పు సత్యాగ్రహం

జాతిపిత మహాత్మా గాంధీ పిలుపుతో జిల్లాలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని వందలాది మంది పోలీసుల నిర్బంధానికి గురయ్యారు. 1930లో దండి సత్యాగ్రహంగా పేరుగాంచిన ఉప్పు సత్యాగ్రహంలో కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ వద్ద టంకాల రంగన్న ఇంటి ముందు ఉప్పు తయారు చేసి, శాసనోల్లంఘనకు సిద్ధపడ్డారు. న్యాయవాది నిష్టల సోమయాజీ పంతులు, టంకాల వెంకటరాజు, అంధవరపు లక్ష్మణమూర్తి తదితరులు వందేమాతర గీతాన్ని ఆలపిస్తూ ప్రజలతో సముద్రానికి ఊరేగింపుగా వెళ్ళారు. సముద్రపు నీటిని తెచ్చి ఉప్పును పండించేందుకు ఉపక్రమించారు. 1930 ఏప్రిల్ 19న ఉన్నం రామలింగం మాస్టారు ఆధ్వర్యంలో నౌపడలో ఉప్పు కుప్పల లూటీకి సిద్ధమయ్యారు. ఆ లూటీ విషయాన్ని రామలింగం మాస్టారు, పుల్లెల శ్యామసుందరరావు, టి.ఎన్ గుప్త నరసన్నపేటలో బస చేసిన గంజాం జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయడం జాతీయోద్యమ ప్రత్యేకత.



జమిందారీ వ్యతిరేక పోరాటం

40వ దశకంలో జాతీయోద్యమంతో పాటు జమిందారీ వ్యతిరేక పోరాటం తీవ్రతరమైంది. 1937లో చారిత్రాత్మకమైన రైతు రక్షణయాత్ర ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ సాగింది. కామారెడ్డి సత్యనారాయణ, చలసాని ప్రసాదరావు, పుల్లెల శ్యామసుందరరావు, పుండరీకాక్షాచారి, గౌతు లచ్చన్న తదితరులు యాత్రకు నాయకత్వం వహించారు. జాతీయోద్యమం జరుగుతున్న సమయంలో 1940 మార్చి 26, 27 తేదీల్లో తీవ్ర నిర్బంధాల మధ్య పలాసలో ఐదో అఖిల భారత కిసాన్ సభలు జరిగాయి. మహాసభ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. కిసాన్ సభకు అధ్యక్షులుగా ఎన్నికైన రాహుల్ సాంకృత్యాయన్‌ను అప్పటికే అరెస్టు చేశారు. ఆ సభలను నిర్బంధాల మధ్య పుల్లెల శ్యామసుందరరావు, గౌతు లచ్చన్న, మార్పు పద్మనాభం, చెంబాళం గవరయ్య, గానుగుల తరుణాచారి తదితరుల నాయకత్వంలో విజయవంతంగా నిర్వహించగలిగారు. కిసాన్‌సభ స్ఫూర్తితో మందస జమిందారీ పోరాటం తీవ్రతరమైంది. ఆ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన మార్పు పద్మనాభం, గానుగుల తరుణాచారి, చెంబాళం గవరయ్యను పోలీసులు అరెస్ట్ చేసి కడలూరు జైల్లో పెట్టారు. బ్రిటిష్ ప్రభుత్వ ఆజ్ఞలు పాటించరాదని, జమిందారుకు పన్నులు చెల్లించరాదని ప్రజలు నిర్ణయించుకున్నారు. పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. వారిని విడిచిపెట్టాలని ప్రజలు అడ్డుకున్నారు. ఆగ్రహించిన పోలీసులు 1940 ఏప్రిల్ 1న కాల్పులు జరపడంతో వీరనారి సాసుమాను గున్నమ్మతో పాటు గుంటబుడి మూడు, గొర్లె జగ్గయ్య, క్రరి కలిమాడు, గుంట చిననారాయణ మృతి చెందారు. ఆ సమయంలోనే గౌతు లచ్చన్న అజ్ఞాతవాసంలోకి పోయి తోటాడలోని బెండి శ్రీరామ్మూర్తి ఇంట్లో ఉన్నారు. మందస కాల్పుల తర్వాతనే ఇచ్ఛాపురంలో పుల్లెల శ్యామసుందరరావును గృహనిర్బంధం చేశారు. 1940 జూన్ 16న గృహ నిర్బంధంలోనే ఆయన మరణించారు.

క్విట్ ఇండియా ఉద్యమం

1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్న గౌతు లచ్చన్న జిల్లాలోనే కాదు రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లోనూ పర్యటించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన హిందూఫౌజ్‌లో చేరిన వారిలో మడ్డు కృష్ణమూర్తి, తెప్పల నారాయణ, నరసన్నపేట దరి హుస్సేన్‌పురానికి చెందిన లాలిశెట్టి అప్పారావు, బారువాకు చెందిన పోడిపల్లి సూర్యనారాయణ, మార్పు కృష్ణమూర్తి, మైలపల్లి సూర్యనారాయణ, చిన్నవెంటాపురానికి చెందిన బొడ్డేపల్లి సీతారాములు తదితరులు పట్టుబడి శిక్షలు అనుభవించారు. 40వ దశకం చివరిలో విజయనగరం, పర్లాకిమిడిలో విద్యనభ్యసిస్తున్న జిల్లాకు చెందిన అనేకమంది యువకులు కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. చదువుకు స్వస్తి చెప్పి కార్యకర్తలుగా వచ్చిన వారూ ఉన్నారు. అలాంటి వారిలో గంటి రాజేశ్వరరావు, దారపు గోవిందరాజులు తదితరులు ముందుకొచ్చి ఉద్యమ నిర్మాణంలో పనిచేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు ఆర్ట్స్ కళాశాలలో జెండా పండుగ
- పతాకావిష్కరణ చేయనున్న ఇన్‌ఛార్జి మంత్రి బొత్స
- 269 మందికి ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ఉదయం తొమ్మిది గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి రాధిక సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థులతో పాటు అధికారులు, రాజకీయ ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరువైపులా త్రివర్ణ పతాకాలను బారికేడ్లకు ఏర్పాటు చేశారు. పోలీస్ పెరేడ్‌తో పాటు ఎన్‌సిసి క్యాడెట్లు, స్కౌట్, గైడ్స్ విద్యార్థులు గౌరవ వందనం అందించనున్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా శకటాలు, స్టాల్స్‌ను ప్రదర్శించనున్నారు. ఇందులో ఆకట్టుకున్న మూడు శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నారు.

పటిష్ట బందోబస్తు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఆర్ట్స్ కళాశాల మైదానం పరిసర ప్రాంతాలను బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. ప్రత్యేక బలగాలతో పాటు సివిల్ పోలీసు సిబ్బంది సుమారు 400 మంది విధుల్లో ఉన్నారు. వేడుకలు నిర్వహించే మైదానం వద్దకు కేవలం విఐపి వాహనాలనే అనుమతించనున్నారు. పలు పాఠశాలల విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు, ఇతర వాహనాలకు కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద పార్కింగ్ స్థలాన్ని కేటాయించినట్లు ట్రాఫిక్ డిఎస్‌పి సిహెచ్.జి.వి ప్రసాద్ తెలిపారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పరిశీలించారు. వేడుకలకు సంబంధించిన వేదిక, ప్రదర్శన స్టాల్స్, సీటింగ్, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఆర్‌డిఒ బి.శాంతిని ఆదేశించారు. వేడుకలకు వచ్చే స్వాతంత్ర్య సమరయోధులు, జిల్లా అధికారులు, పాఠశాల విద్యార్థులకు విడివిడిగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

పెరేడ్ రిహార్సల్స్ పరిశీలన

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పోలీసుల కవాతు రిహార్సల్స్, భద్రత, బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఎఎస్‌పి జె.తిప్పేస్వామితో కలిసి పరిశీలించారు. ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్‌పి డి.ప్రసాద్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు.

ఉత్తమ పురస్కారాలకు 269 మంది ఎంపిక

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 269 మందికి ఉత్తమ పురస్కారాల కోసం ఎంపిక చేశారు. 80 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 260 మందిని ఉత్తమ సేవకులుగా సిఫార్సు చేశారు. ఆరు స్వచ్ఛంద సంస్థల నుంచి తొమ్మిది మందికి పురస్కారాలు అందించాలని నిర్ణయించారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో ముగ్గురు జిల్లా అధికారులున్నారు. వారిలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా గృహ నిర్మాణ అధికారి నక్క గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ ఉన్నారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్లు ఇతర ఉద్యోగులు కలిపి ఐదుగురు ఉన్నారు. జిల్లా పోలీసు శాఖకు చెందిన 24 మందిని ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆరుగురిని పురస్కారాలకు సిఫార్సు చేశారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ఏడుగురిని, పలాస ఆర్‌డిఒ కార్యాలయం నంచి ఆరుగురిని ఎంపిక చేశారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అందజేయనున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి ధర్మానకు 'అంగన్వాడీ' నాయకుల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ కోరారు. పెద్దపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి వేతనాన్ని పెంచుతామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు టి.హెచ్.ఆర్ అమలుకు కొత్తగా తీసుకొచ్చిన యాప్ వల్ల అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ యాప్ అమలు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుండి టిఎ బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని, వారికి తోడు గ్రామ సచివాలయాల పర్యవేక్షణ, ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె. తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేకమంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలను పెంచాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు అందజేయాలని, వేతనంలో సగం పెన్షన్ ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జె.కాంచన, నాయకులు కె.ప్రమీలాదేవి, పి.రాజేశ్వరి, కె.సంధ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ఎక్కువ కేసులు రాజీకి కృషి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సెప్టెంబరు తొమ్మిదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీసు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయడం వల్ల గ్రామీణ ప్రజల్లో స్నేహపూర్వకమైన వాతావరణం ఉంటుందన్నారు. ప్రత్యేక దృష్టిసారించి కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న చిన్నారి ఆద్య

చిన్ని గుండెకు పెద్ద కష్టం

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - కవిటి

ఏడు నెలల పాటు ఆడుతూ పాడుతూ కేరింతలు కొట్టిన ఆ చిన్నారికి అనుకోని ఆపద ఎదురైంది. లేకలేక కలిగిన తమ సంతానాన్ని చూసి మురిసిపోయిన ఆ తల్లిదండ్రుల మురిపెం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన యాంద్రాపు చిరంజీవి, అంజలి దంపతుల తొమ్మిది నెలల కుమార్తె ఆద్య హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. జూలైలో ఆద్యకు జ్వరం రావడంతో సోంపేటలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఫలితం లేకపోవడంతో, శ్రీకాకుళంలోని మరో ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో, ప్రస్తుతం విశాఖపట్నంలోని గాంధీ కేన్సర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చిన్నారిని పరీక్షించిన వైద్యులు పాప హెచ్ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు తేల్చారు. చికిత్సకు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని, చికిత్స కూడా మూడు వారాల్లోగా చేయాలని చెప్పారు. దీంతో గ్రామ వాలంటీరుగా పనిచేస్తున్న ఆద్య తండ్రి చిరంజీవి దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇప్పటికే పాప వైద్యం కోసం రూ.మూడు లక్షలకు పైగా ఖర్చు చేశామని, ప్రస్తుతం అంత పెద్ద మొత్తం ఖర్చు చేసే ఆర్థిక స్తోమత తమకు లేదని చిరంజీవి వాపోతున్నాడు. దాతలు ఉదారంగా స్పందించి తమ బిడ్డకు ప్రాణదానం చేయాలని ప్రాధేయపడుతున్నాడు. ఫోన్ పే నంబరు 9515256362, ఎస్‌బిఐ అకౌంట్ నంబరు 11644708533, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0002742కు దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు

- 'స్పందన'లో కలెక్టర్‌కు ఫిర్యాదు
- పలు సమస్యలపై 190 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, ఉన్న సమయంలోనూ లోఓల్టేజీ వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాతపట్నం, మెళియాపుట్టి, మందస ప్రాంతాల నుంచి పలువురు రైతులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ బోర్లు పనిచేయకపోవడంతో నాట్లు వేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్ వినతులు స్వీకరించారు. పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై స్పందనకు 190 వినతులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ భూముల సర్వే నిర్వహించలేదని, సర్వే చేసి ఆక్రమణలకు గురికాకుండా భూములను కాపాడాలని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మహమ్మద్ సిరాజుద్దీన్, ఎం.ఎ బేగ్, షేక్ ఆమన్ తదితరులు కోరారు. వంశధార ఎడమ కాలువ ఆయకట్టు శివారు ప్రాంతమైన పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాలకు సాగునీరందడం లేదని పలువురు రైతులకు ఫిర్యాదు చేశారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

నీటిపారుదలశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్యను పరిష్కరించడం లేదని చెప్పారు.

స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారంలో నాణ్యత ఉండాలన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని చెప్పారు. విచారణ చేపట్టకుండా ఫిర్యాదుదారునికి వివరణ ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ మురళీకృష్ణ, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డిఎస్ఒ వెంకటరమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్ రింగ్ పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన ఎన్‌ఎసిఎల్ సౌజన్యంతో బాక్సింగ్ రింగ్ పోటీలు నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల క్రీడల్లో పతకాలు సాధించిన వారు జిల్లాలో ఎందరో ఉన్నారని చెప్పారు. సరైన మౌలిక వసతులు లేక బాక్సింగ్ పోటీల్లో జిల్లా రెండో స్థానంలో నిలుస్తోందని, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. క్రీడా నిధులు, జిల్లా నిధులు, సిఎస్ఆర్ ఫండ్స్‌ను వినియోగించి క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. బాక్సింగ్ క్రీడాకారులు ద్వితీయ స్థానం నుంచి ప్రథమ స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కృషి, పట్టుదల, సాధన, తపన ఉంటే క్రీడాకారులకు సాధ్యం కానిది ఉండదన్నారు. తొలుత స్టేడియంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ శ్రీధర్, ఎన్‌ఎసిఎల్ వైస్ ప్రెసిడెంట్ కె.శేషగిరిరావు, డిజిఎం పి.ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.వి ఉజ్వల్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజల గుణపాఠం తప్పదు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

పొందూరు : ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజల నుంచి గుణపాఠం తప్పదని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి సానుభూతిపరుల కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్న చంద్రబాబునాయుడుపై ముఖ్యమంత్రి దాడి చేయిస్తున్నారని ఆరోపించారు. వైసిపి వారే దాడి చేసి తిరిగి ప్రతిపక్ష నాయకులపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఎంతో స్వేచ్ఛగా పాదయాత్ర చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు ప్రతిపక్షాలపై అణచివేత ధోరణికి పాల్పడడం, దాడులు చేయడం ఆయన ఫ్యాక్షన్ నైజానికి నిదర్శనమన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు ఈ విధంగా ఆలోచిస్తే జగన్ పాదయాత్ర చేయగలిగేవారా అని ప్రశ్నించారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పోలీసు 'స్పందన'కు 38 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందనలో 38 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను ఎస్‌పి జి.ఆర్.రాధిక స్వీకరించి పరిశీలించారు. ఫిర్యాదుదారులు తమ తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. అనంతరం ఫిర్యాదిదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియపరిచారు. చట్టపరిధిలోని సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. కుటుంబ తగాదాలకు సంబంధించినవి పది, పౌర సంబంధాలపై 8, పాత ఫిర్యాదులు 7, చీటింగ్ మూడు, ఇతర ఫిర్యాదులు పది వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

విఒఎలను ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సిబిఒహెచ్ఆర్ పాలసీ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, విఒఎల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అరుణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో యూనియన్ నాయకులు ఎం.జగన్ అధ్యక్షతన సోమవారం క్లస్టర్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యూలర్‌ను రద్దు చేయాలన్నారు. సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి పనులు సెర్ప్ అధికారులు చేయడం సరికాదన్నారు. వయసుపై బడిన వారికి, అనారోగ్యంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలన్నారు. మహిళా మారుల్లో బలవంతపు కొనుగోళ్లు, విఒఎలకు లక్ష్యాలు ఇచ్చే పద్ధతి నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి.అసిరినాయుడు, మండలాల నాయకులు వై.మురళి, కె.సీతమ్మ, ఎన్.లక్ష్మి, కె.తులసి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

సోంపేట: ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందిన తులసమ్మ కుమార్తెలకు 1995-96లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు దుమ్ము నేతాజీ, కదంబాల షణ్ముఖరావు, సాన జయరాం, గొరకల ఆనంద్, డొక్కరి పాపారావులు తులసమ్మ కుమార్తెలు వందన, ఝాన్సీల ఇంటికి వెళ్లి రూ.20 వేలు నగదు అందజేశారు. తులసమ్మ కుమార్తెలకు ఉద్యోగం కల్పించేందుకు కృషి చేస్తానని సీనియర్ జర్నలిస్టు దుమ్ము నేతాజీ భరోసాఇచ్చారు. కార్యక్రమంలో సొర్ర రాము, పాతిని నాని పాల్గొన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి- కవిటి

మనం ఎన్ని త్యాగాలు చేసినా మాతృభూమి రుణం తీర్చుకోలేనిదని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగ, జగతి గ్రామంలో ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బల్లిపుట్టుగలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల నిస్వార్థ కృషి ప్రస్తుతం మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని అన్నారు. ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా మాతృభూమి సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి ఒక్కరూ ప్రకృతి పరిరక్షణకు పాటు పడాలని, అందుకు అనుగుణంగా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం మాతృభూమి సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు పూడి ప్రసాదరావు, శ్రీకన్య దలై, ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ రజనీకుమార్ దలై, ఎపిఎం గోవిందరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : మండలంలోని లొత్తూరు, రెంటికోట, లొబ్బభద్ర, తర్లకోట, అల్లుకోల గ్రామాలలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన మన భూమి మన దేశంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వతంత్ర సమరయోధులకు ఘనంగా నివాళ్లర్పించారు. ముందుగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఒక్కొక్క పంచాయతీలో 75 మొక్కలు చొప్పున నాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శానపురి తిరుమలరావు, దువ్వాడ వామాక్షి, కర్ర సంతోష్ కుమార్, సర్పంచ్ ప్రతినిధి సవర సీమాన్, మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, కార్యదర్శులు జె.రుపేంద్రరావు, సద్గుణబాబు, ఆశ, చిరంజీవి పాల్గొన్నారు.


పొందూరు : మొక్కను నాటుతున్న రమేష్

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన మన దేశం... మన మట్టి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఆవరణలో చెత్త చెదారాలను పరిశుభ్రం చేశారు. అలాగే కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినేని పాపారావు, అధ్యాపకులు తపన్ కుమార్ జెనా, బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని గంగారం, దుప్పలపాడు గ్రామాల్లో మా భూమి-నాదేశంలోని మాట్లాడారు. కార్యక్రమంలో ఎపిడి శైలజ, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, సర్పంచ్ జి.సూర్యప్రకాష్, ఎపిఒ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని బొబ్బిలిపేటలో నా భూమి నా దేశంలో భాగంగా శిలాఫలకాన్ని సర్పంచ్ గొండు రమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చింతాడ అప్పారావు, కార్యదర్శి బి.పూర్ణిమ, ఉపాధి హామీ ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్.పుష్ప, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని ఎ.పి.పేటలో నా భూమి-నాదేశంలో భాగంగా సర్పంచ్ కె.వెంకటశివసాయి సీతారామరాజు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పద్మ, ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సునీత, మెట్లు, ఎన్ఆర్ఇజిఎస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో బురిడికంచరాంలో నాభూమి-నాదేశంలో ఉపాధిహామీ అధికారులు శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గంట్యాడ రమేష్, ఉపసర్పంచ్ పిన్నింటి అప్పలనాయుడు, కార్యదర్శి మురళీధర్, ఎన్ఆర్ఇజిఎస్ టిఎ నటరాజ్, ఎఫ్ఎ పైల రవి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లా ఖజానాశాఖ ఆధ్వర్యాన విధి నిర్వహణలో వీరమరణం పొంది సైనికుల కుటుంబం నుంచి కారుణ్య నియామకం పొందిన మహిళా ఉద్యోగితో పాటు యుద్ధ సమయంలో మృతి చెందిన జవాన్ కుటుంబం నుంచి కారుణ్య నియామం పొందిన ఉద్యోగిలు సోమవారం కలెక్టరేట్‌లో సత్కరించారు. వారి త్యాగాలను కొనియాడారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎటిఒ తవిటయ్య, ప్రదీప్, డేవిడ్ పాల్గొన్నారు.

దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగమూర్తులు సుదీర్ఘ కాలం పాటు పోరాడారని, అటువంటి వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, క్యూఎసి కో-ఆర్డినేటర్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ పిఒ మధవీలత, రుద్రమరాణి, హేమ పద్మజ పాల్గొన్నారు.


కవిటి : ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, తదితరులు


సంతబొమ్మాళి : మట్టిని సేకరిస్తున్న జగన్నాయకులు

సంతబొమ్మాళి : మండలంలోని ఉమిలాడ పంచాయతీ డోకిరామన్నపేటలో నా భూమి-నా దేశం, వీరులకు వందనంలో భాగంగా పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు అమరవీరుల స్థూపాన్ని ప్రారంభించారు. అలాగే పాతమేఘవరంలో సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి సూరాడ రాజారావు, పాలతలగాంలో సర్పంచ్ నక్కిట్ల అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార జిల్లా సొసైటీ డైరెక్టర్ సూరాడ జోగారావు, ఉప సర్పంచ్‌లు కె.దామోదరరావు, సింహాచలం, ప్రధానోపాధ్యాయులు యు.డి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ట్రిపుల్ ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో జాతీయ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన యోగా పోటీల్లో ట్రిపుల్ ఐటి విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ట్రెడిషనల్ ఆసన 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు గల బాలురు విభాగానికి పియుసి-2 విద్యార్థి భరత్ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఇంజినీరింగ్ విద్యార్థి గణేష్ సిల్వర్, విజయ్ సిల్వర్, నవీన్ బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. అలాగే ట్రెడిషనల్ యోగా బాలికల విభాగంలో రజిత గోల్డ్‌మెడల్, నళిని సిల్వర్, రిథమిక్‌లో రజిత గోల్డ్, నళిని సిల్వర్ మెడల్స్‌ను సాధిచారు. ఆర్టిస్టిక్ బాయ్స్ షోలో విభాగానికి విజయ్ సిల్వర్ మెడల్‌ను సాధించారు. విజేతలకు ట్రిబుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, యోగా విభాగపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనంజయరావు, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, గేదెల రవి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న జగదీశ్వరరావు

ఇంటింటికీ టిడిపి

రణస్థలం: మండలంలోని తిరుపతిపాలెంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణ తరగతుల మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ప్రజలు పడుతున్న ఇబ్బందులు, ప్రజా సమస్యలు స్వయంగా తెలుసుకున్నారు. ఇంటింటికీ తెలుగుదేశం- ప్రతి ఇంటికీ కలిశెట్టి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆత్మీయంగా పలకరించి వారి బాగోగులను, సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్ గ్యారెంటీ పథకాలను వివరించారు.


సమస్యలు తెలుసుకుంటున్న అప్పలనాయుడు

బంగారు సూక్ష్మ జాతీయ జెండా

పలాస : 77వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అతి చిన్న సూక్ష్మ బంగారు త్రివర్ణ పతాకాన్ని తయారు చేసి తన దేశభక్తిని చాటి చెప్పారు పలాస మున్సిపాలిటీ గాంధీనగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ ఆచారి. సూక్ష్మ బంగారు జాతీయ జెండాకు ఎటువంటి అతుకులు లేవని, ఎత్తు కేవలం అర సెంటీమీటర్లు దీని బరువు కేవలం 0.50 మిల్లి గ్రాముల బంగారాన్ని ఉపయోగించి దీన్ని తయారు చేసినట్లుగా తెలిపారు. దీని ఖరీదు కేవలం రూ.200 విలువగల బంగారంతో తయారు చేశారు. దీని తయారీకి నాలుగు గంటల సమయం పట్టిందని రమేష్‌ఆచారి తెలిపారు.


బంగారంతో తయారు చేసిన జాతీయ జెండా

కోడి గుడ్డుపై గాంధీ చిత్రం

కవిటి: జాతిపిత మహాత్మా గాంధీజీ, భారతదేశ చిత్రపటాలను కోడిగుడ్డుపై చిత్రించిన కవిటి మండలం కుసుంపురం పంచాయతీ కార్యదర్శి కొప్పల్ల రవి ఔరా అనిపించారు. మొదటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి ఉన్న రవి తనలోని దేశ భక్తిని ఇలా కోడిగుడ్డుపై ప్రతిబింబించి ఆకట్టుకున్నారు.



కోడిగుడ్డుపై వేసిన గాంధీ చిత్రం


కూలిన వంతెన

కూలిన వంతెన

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని అంధవరం వద్ద పోలాకి ఓపెన్ హెడ్‌కు అనుబంధంగా ఉన్న వంశధార కాలవపై ఉన్న వంతెన సోమవారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పరపేట, అంధవరం, గంగన్నపేట, గొల్లపేట, రామకృష్ణాపురం, పర్లాం, యాతపేట, మాకివలస, లింగన్నాయుడుపేట, తిమడాం తదితర గ్రామాల ప్రజలు వాహనాలతో ఈ వంతెనపై రాకపోకలు సాగించేవారు. పదేళ్ల నుంచి ఇదే వంతెనపై పరిసర గ్రామాలైన లింగన్నాయుడుపేట, పర్లాం, అంధవరం ఇసుక రీచ్‌ల నుంచి అధిక బరువు కలిగిన లారీలు ఈ వంతెనపై రాకపోకలు సాగించడం వల్లే కూలిపోయేందుకు ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వంతెన పైనుంచి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు స్థానికులు కర్రలతో కంచెను ఏర్పాటు చేశారు.

అక్కివరం సర్పంచ్‌గా జయ ఏకగ్రీవం

ఆమదాలవలస : మండలంలోని అక్కివరం పంచాయతీ సర్పంచ్‌గా గురుగుబెల్లి జయ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు తెలిపారు. ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా, అందులో ఒకరు సోమవారం ఉపసంహరించుకోవడంతో ఆమెను ఏకగ్రీవంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలోని కలివరం పంచాయతీలో రెండో వార్డుకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో చింతాడ సునీత కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కొరపాం పంచాయతీలో నాలుగో వార్డుకు రెండు నామినేషన్లు దాఖలయ్యాయని, అందులో మజ్జి లక్ష్మి అనే అభ్యర్థికి ప్రెజర్ కుక్కర్, మరో అభ్యర్థి సుశీలకు గౌను గుర్తులను కేటాయించినట్లు తెలిపారు.

పెదలంకాం సర్పంచ్ బరిలో ఇద్దరు

బూర్జ : మండలంలోని పెదలంకాం గ్రామ పంచాయతీలో ఈనెల 19న సర్పంచ్ ఉప ఎన్నిక నిర్వహించనున్నామని, ఈ ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు మిలిగినట్లు ఎంపిడిఒ రవీంద్రబాబు సోమవారం తెలిపారు. కొమరాపు అచ్చంనాయుడు, కాగితాపల్లి గోవిందరావు సర్పంచ్‌గా పోటీ పడుతున్నారని అన్నారు. పెదలంక సర్పంచ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, సోమవారం ఆరుగురు అభ్యర్థులు వారి నామినేషన్లు ఉపసంహరించుకున్నారని తెలిపారు. దీంతో ఇద్దరు అభ్యర్థులు మాత్రమే పోటీ బరిలో నిలిచినట్లు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.

గోకర్ణపల్లిలో 2వ వార్డు బరిలో ఇద్దరు

పొందూరు: మండలంలోని అతిసమస్యాత్మక గ్రామమైన గోకర్ణపల్లి పంచాయతీలోని 2వ వార్డు సభ్యుని ఎన్నిక అనివార్యమైంది. గత పంచాయతీ ఎన్నికల్లో 2వ వార్డు సభ్యునిగా ఎన్నికైన గురుగుబెల్లి రమణ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అధికారులు దీనికి ఎన్నిక షెడ్యూల్‌ను ప్రకటించారు. దీంతో ఈ వార్డు సభ్యత్వానికి సీపాన వెంకటరమణ, గురుగుబెల్లి నర్శింహరావు, చింతాడ సూర్యనారాయణలు నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో సీపాన వెంకటరమణ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నట్లు ఆర్‌ఓ ఆంజనేయనాయక్ తెలిపారు. దీంతో మిగిలిన ఇద్దరు బరిలో నిలవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 19న వార్డు సభ్యత్వానికి ఎన్నికను నిర్వహించనున్నారు. ఇందులో గురుగుబెల్లి నర్శింహరావుకు ప్రెషర్ కుక్కర్, చింతాడ సూర్యనారాయణకు గౌను గుర్తులను అధికారులు కేటాయించారు.


పొందూరు: ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శివకుమార్

పొందూరు 14వ వార్డు ఏకగ్రీవం

పొందూరు మేజర్ పంచాయతీ 14వ వార్డు సభ్యునిగా అనకాపల్లి శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్ఒ స్టేజ్-1 ఆఫీసర్ పి.వి.రామరాజు సోమవారం తెలిపారు. పంచాయతీలోని 14వ వార్డు సభ్యుడు అనకాపల్లి అక్కలనాయుడు అకాలంగా మృతి చెందడంతో అధికారులు ఎన్నికను నిర్వహించగా, ఈ వార్డుకు ఆయన కుమారుడు శివకుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.


పోస్టర్‌ను అందజేస్తున్న సుజాత

టిడిపితోనే మహిళలకు రక్షణ

లావేరు: తెలుగుదేశం పార్టీ హయాంలోనే మహిళలకు రక్షణ ఉంటుందని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. టిడిపి మహాభక్తి కార్యాలయంలో భాగంగా మండలంలోని తామాడ పంచాయతీ కొత్తరౌతుపేటలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. ముందుగా వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అన్నివిధాలా విఫలమైందన్నారు. అన్నింటిపై నా భారాలు మోపి ప్రజలు బతికలేని పరిస్థితి తయారైందన్నారు. ఇసుక, మట్టి, భూ దందాలను ప్రశ్నించే వారిపై కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె శ్రీనివాసురావు, కడుపుకుట్ల రమణనాయుడు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి

టెక్కలి రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'హర్ ఘర్ తిరంగా' నినాదంతో.. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఎంపిడిఒ హెచ్.వెంకట రమణమూర్తి అన్నారు. మండలంలోని తిర్లంగిలో ఓ ఇంటిపై సోమవారం జాతీయ జెండాను కట్టారు. ఎపిఒ బగాది ప్రసాదరావు, కార్యదర్శి ఆర్.రాంకుమార్, సర్పంచ్ ప్రతినిధి సనపల కృష్ణమరాజు, సనపల బులుసు, వజ్జ మధు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, నాలుగున్నరేళ్లుగాప్రజలను ఇబ్బందులు పెడుతున్న వైసిపి ప్రభుత్వం పయిపోయిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో డల్లాస్ నగరంలో ఎన్ఆర్ఐ టిడిపి కుటుంబ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ సిఎం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రవాస ఆంధ్రులు ప్రస్తుత ఆంధ్రా పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మాతృ రాష్ట్రానికి దూరంగా ఉన్నా ఆంధ్రా అభివృద్ధి చెందాలని, అన్నింటా ఆదర్శంగా ఉండాలని అక్కడ తెలుగు వారు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అసత్యపు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి హామీలను తుంగలోకి తొక్కిన వైసిపి పార్టీని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.


ఎన్ఆర్ఐ టిడిపి కుటుంబ సభ్యులతో గౌతు శిరీష

'ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం' పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీతులసీ

పోలాకి : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమంపై వైద్యులు నిర్లక్ష్యంగా ఉండకుండా, వైద్య శిబిరానికి వచ్చే ప్రతి రోగికీ అందించే వైద్యసేవలను ఆన్‌లైన్ నిక్షిప్తం చేయాలని జిల్లా ఫ్యామిలీ డాక్టర్, కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీతులసి సూచించారు. మండలంలోని ఈదులవలసలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం వైద్య శిబిరాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు అందించే అన్ని రకాల సేవలను ప్రభుత్వ రూపొందించిన యాప్‌లో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని మాకివలస పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీనాథ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన నారుమడుల పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని పలాసపురంలో ఎండిపోయిన నారుమడులను మండల ఎఒ బి.నరసింహమూర్తి సోమవారం పరిశీలించారు. ఈ మేరకు రైతులకు పలు సూచనలు చేశారు. వరి నారు సంరక్షించేందుకు, ఐదు గ్రాములు పొటాషియం నైట్రేట్ ఏడు గ్రాములు లీటర్ నీటికి కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలన్నారు. అలాగే నాలుగైదు రోజుల పాటు నారును కాపాడుకోవచ్చునని అన్నారు. అలాగే తాళబద్ర, మామిడిపల్లి, గొల్లూరు, శాసనం, పాలవలస, కొర్లాం, సోంపేట గ్రామాల్లోనూ వరి నారుమడులు ఎండిపోతున్నాయని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆయనతోపాటు గ్రామ వ్యవసాయ సహాయకులు వి.జీవిత ఉన్నారు.


ఎండిన నారుమడిని పరిశీలిస్తున్న ఎఒ నరసింహమూర్తి

వాటర్ క్యాన్ల పంపిణీ

ఇచ్ఛాపురం : స్థానిక కస్తూరిబా పాఠశాలకు అవసరమైన వాటర్ క్యాన్లను జర్నలిస్టు ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.శిరీష మాట్లాడుతూ ఉపాధ్యాయులు లక్ష్మి జెపిసి తెలిపిన వెంటనే స్పందించి ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ప్రెసిడెంట్ టి.రాజేష్ మాట్లాడుతూ ప్రతి చిన్నారీ బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించి సమాజానికి తోడ్పడాలని అన్నారు. కార్యక్రమంలో కోట రామారావు, డి.రాజేష్, మోహన్, జీవన్, గణేష్, సురేష్, సునీల్, అధ్యాపకులు శ్రీదేవి, గీతాభారతి, దీపిక, మంజు పాల్గొన్నారు.


వాటర్ క్యాన్‌ను అందజేస్తున్న రాజేష్

రణస్థలంలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

స్వాతంత్ర్యానికి ముందు భారతదేశాన్ని విభజన చేసి చాలా మంది ప్రాణమానాలు దోచుకుని 1947 ఆగస్టు 14 దేశ చరిత్రలో నిలిచిపోయిందని, అటువంటి దినాన్ని నిరసన దినంగా పాటిస్తున్నామని బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ నడుకుదుటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. ఈ సందర్భంగా రామతీర్థాలు కూడలి నుంచి జాతీయ జె.ఆర్.పురం సర్కిల్ కార్యాలయం వరకూ సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్వంతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లంక అప్పలనాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు గురాల రఘునాథ్, టి.అప్పలరాజు, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, కాయిత రమణ, వెలిచేటి కామేశ్వరారావు, ఆకెళ్ల సూరిబాబు, దుక్క ఆదినారాయణ, దన్నాన రాజేంద్ర, పి.వి.రత్నం, త్రినాథరావు, కొమర లక్ష్మణ, బావరాజు శ్రీధర్, గోపిన కృష్ణారావు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఈశ్వరరావు

జెండాల పంపిణీ

లావేరు: స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో బిజెపి మండల అధ్యక్షుడు ఇజ్జాడ శ్రీనివాసరావు హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 600 జాతీయ జెండాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఇంటిపై జెంగా ఎగురవేశారు. కార్యక్రమంలో ఇ.ఆదిత్య, రమణ, ఇప్పిలి నాగేశ్వరరావు, జి.గొల్ల, గంట్యాడ అప్పలనాయుడు, లక్ష్మణ, శివ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- లావేరు

ఓ వ్యక్తి అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కేశవరాయునిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశవరాయునిపాలెంకు చెందిన నాయిని ఢిల్లీరెడ్డి (32) చిన్నమురపాకకు చెందిన ఓ చిట్టీల వ్యాపారికి అప్పు ఉండడంతో ఇటీవలే గ్రామపెద్దల సమక్షంలో రాజీ కుదిర్చారు. తీసుకున్న అప్పు తీర్చకపోవడంతో చిట్టీల వ్యాపారి నోటీసులు పంపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఢిల్లీరెడ్డి ఈ నెల 12న ఎచ్చెర్ల మండలం బైపాస్ కూడలి వద్ద ఉదయం పురుగులు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన స్థానికులు జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడు స్థానికంగా వ్యాను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఢిల్లీరెడ్డి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇప్పుడు మా కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారని భోరున విలపిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

బూర్జ : పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం గొయిది వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బూర్జ మండలం గుత్తావలికి చెందిన విద్యార్థిని మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుత్తావల్లికి చెందిన పైడి గోవిందరావు, ఉమ కుమార్తె వసంత (18) ఎచ్చెర్ల మండలంలోని ఓ ప్రయివేటు కళాశాలలో బిఫార్మసీ చదువుతుంది. తన స్నేహితునితో కలిసి సీతంపేట అడ్వెంచర్ పార్కును చూసేందుకు ఉదయం వెళ్లారు. తిరిగి ప్రయాణంలో గొయిది వద్ద బైక్ బోల్తా పడడంతో ఆమె తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృత్యువాత పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలానికి వెళ్లి కుమార్తె మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. తొలి బిడ్డ బాల్యంలోనే మరణించిందని, రెండో సంతానం ప్రమాద రూపంలో మమ్మల్ని విడిచి వెళ్లిపోయిందని భోరున విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


వసంత (ఫైల్)

టిప్పర్ ఢీకొని యువకునికి గాయాలు

నౌపడ: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో పనిచేస్తున్న వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతబొమ్మాళి మండలం హనుమంత నాయుడుపేట పంచాయతీ సీతారాంపురానికి చెందిన లక్ష్మీనారాయణ పోర్టులో పని చేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. శివాలయం వద్దకు వచ్చేసరికి అతివేగంగా వెళ్తున్న టిప్పర్ ఢీకొనడంతో లక్ష్మీనారాయణ ఎడమ కాలు టిప్పర్ కింద పడి నలిగిపోయింది. తీవ్ర గాయాలతో ఉన్న లక్ష్మీనారాయణను స్థానికులు టెక్కలి జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై నౌపడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ఆందోళన

గాయపడిన వ్యక్తికి అడుకోవాలని క్షతగాత్రుడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మూలపేట పోర్టు ప్రాంతం వద్ద ఆందోళన దిగారు. మూలపేట సర్పంచ్ బాబూరావు, హనుమంతునాయుడుపేట మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కరరావు ఆధ్వర్యాన భారీగా చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. పోర్టు పనులు ప్రారంభమైనప్పటి నుంచి భారీ వాహనాలు అతివేగంగా ప్రయాణిస్తూ మిగతా వాహనదారులను భయభ్రాంతులకు గురవుతున్నాయని అన్నారు. ప్రధాన కూడలి వద్ద కూడా అతివేగంగా వాహనాలు ప్రయాణిస్తుండడంతో పలువురు ప్రమాదాలకు గురవగా, మరికొందరు ప్రమాదం నుంచి బయటపడుతున్నారని అన్నారు. దీనికి పోర్టు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉదయం ప్రమాదం జరిగితే ఇప్పటివరకు కాంట్రాక్టర్, యాజమాన్యం జాడలేదని, మెరుగైన చికిత్స అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బాధిత వర్గాల ఆందోళనతో భారీగా పోలీసుల మోహరించారు. దీంతో సోమవారం రాత్రి వరకు ఉద్రిక్తత కొనసాగింది.


నిలదీస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో గాయపడిన లక్ష్మీనారాయణ


పురస్కారాన్ని స్వీకరిస్తున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు శతావధాన ప్రాశ్నిక పురస్కారం

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన మూడు రోజుల పాటు నిర్వహించిన సంస్కృతాంధ్ర భాషలలో జరిగిన సంపూర్ణ శతావధాన కార్యక్రమం నిర్వహించారు. పలాసకు చెందిన రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి శతావధాన ప్రాశ్నిక పురస్కారం లభించింది. త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ చేతుల మీదుగా సోమవారం జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సభా సంచాలకులు అవధాన రాజహంస కోట లక్ష్మీనరసింహం, సాహితీ వేత్త డాక్టర్ ఎ.గోపాలరావు, సుమిత్ర కళాసమితి అధ్యతక్ష, గౌరవ అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు పాల్గొన్నారు.


మెమోంటోను అందుకుంటున్న చాణుక్యచంద్ర

చాణుక్య చంద్ర ఒడిలో మరో కలికితురాయి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కపాసుకుద్దికు చెందిన యువ సంగీత తరంగం చలపరాయి చాణుక్య ఒడిలో మరో కలికితురాయి చేరింది. తమిళనాడులోని చెన్నయ్‌లో శక్తి సంగీత సభ ఆధ్వంర్యాన నిర్వహించిన 'క్లాసికల్ మ్యూజిక్ ట్యాలెంట్-23'లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో శ్రీకళ్యాణి కాలేజిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మాస్టర్ చలపరాయి చాణుక్య చంద్ర మృదంగం విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి సత్తా చాటాడు. అనంతరం సంగీత కళానిధి, భారత సంగీత సామ్రాట్, నామ సంకీర్తన రత్న, పద్మభూషణ్ మధురై టిఎన్ శేషగోపాలన్ చేతుల మీదుగా బహుమతిని అందుకున్నాడు. ఈ సందర్భంగా లోళ్ల రాజేష్, కళ్యాణి కాలేజ్ విద్యా సంస్థల యాజమాన్యం, మండలంలోని కళాకారులు చాణిక్యకు అభినందనలు తెలియజేశారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ట్రస్టు సభ్యులు

కొంక్యాన ట్రస్టు భోజన వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నగరంలోని మదర్ థెరిస్సా హోమ్‌లో రెండు పూటలకు అవసరమైన భోజన వితరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కొంక్యాన గోవిందరాజులు 14వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ట్రస్టును స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రచయత, సీనియర్ న్యాయవాది ఎస్.జె.విల్సన్‌బాబు, కొంక్యాన రాధాకృష్ణ, వేణుగోపాల్, కోట సావిత్రమ్మ, కొంక్యాన విజయలక్ష్మి, వెంకటరమణమ్మ, కె.గోవిందరావు, పి.ఫాల్గుణరావు, డాక్టర్ శిష్టు మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని లయన్స్‌క్లబ్ ప్రతినిదులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో కమిషనర్ రమేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో చాలా ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదని అన్నారు. అలాగే కుక్కలతో, ఆవులతో, కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలువల్లోని పూడికలు సక్రమంగా తీయకపోవడంతో దుర్గంధభరితంగా ఉంటుందన్నారు. లైబ్రరీలో పాఠకులకు దిన, వార, మాస పత్రికలు, వైజ్ఞానిక ఆరోగ్య, ఇతర మ్యాగజైన్లు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దక్కత గోపీనాథ్‌రెడ్డి, కాళ్ల నరసింహమూర్తి, పశుపరెడ్డి ఢిల్లీశ్వరరావు, భీష్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసిలో కాగిత రహిత సేవలు

చీఫ్ మేనేజర్ వినాయక స్వామి

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ రంగ సంస్థగా సేవలందిస్తున్న జీవిత బీమా సంస్థ సామాజిక బాధ్యాతగా పర్యావరణ హిత కార్యక్రమాలు అమలు చేస్తోందని, అందులో భాగంగా కార్యాలయంలో పూర్తి కాగిత రహిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని సంస్థ చీఫ్ మేనేజర్ వినాయక స్వామి వెల్లడించారు. ఇఎస్‌జి ఇన్సియేటివ్ ప్రోగ్రాం పేరిట కార్యాలయం ఆవరణలో సోమవారం 50 మొక్కలు నాటారు. అలాగే లబ్ధిదారులకు 300 మొక్కలను పంచిపెట్టారు. ఈ ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అలాగే మరో చీఫ్ మేనేజర్ సత్యనారాయణ సాహూ మాట్లాడుతూ ఎల్‌ఐసి ప్రభుత్వ సంస్థగా అనేక పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇప్పటికే ఎల్‌ఐసి పాలసీలను ఏజెంట్ మిత్రులు ఆనంద యాప్ ద్వారా ఎటువంటి పేపర్ అవసరం లేకుండా పాలసీలను కంప్లీట్ చేసుకునేందుకు వీలు కల్పించిందన్నారు. ఎల్‌ఐసి అన్ని ఆపరేషన్స్‌లోనూ డిజిటైజేషన్ చేయడం ద్వారా పేపర్ లెస్ కార్యాలయంగా మారనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి క్లాస్ త్రీ ఉద్యోగుల నాయకులు గిరిధర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ల తరుపున తారక్, ఏజెంట్ల యూనియన్ తరపున లాడి రమేష్, ధనుంజయరావు, విశ్రాంత ఉద్యోగులు ఎం.ఆదినారాయణమూర్తి, అచ్యుతవల్లి, లక్ష్మి, శ్రీజాన్, అప్పన్నదొర, గణపతిరావు, రామారావు, ప్రతాప్ సూర్యప్రకాష్, ఈశ్వరరావు, సామంత్ పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న వినాయక స్వామి

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రణస్థలం

దళిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎపి దళిత సంఘం మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు కుప్పిల రాముడు అన్నారు. స్థానిక షాదీఖానాలో ఎపి దళిత సంఘం మహాసభ మండలశాఖ కార్యవర్గ ఎన్నిక సోమవారం నిర్వహించారు. ముందుగా ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గద్దర్ పోరాట యోధుల అడుగుజాడల్లో మనమంతా నడుచుకోవాలని సూచించారు. సీనియర్ దళిత నాయకులు కుప్పిలి సీతప్పడు మాట్లాడుతూ ఈ మండలంలో దళితులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని, సమస్యలు పరిష్కరించే విధంగా సంఘం పనిచేయాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షులుగా పల్ల నీలయ్య, గౌరవ అధ్యక్షులుగా సాకేటి పోతయ్య, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి పైడిరాజు, ఉపాధ్యక్షులుగా బంకపల్లి అప్పారావు, బోనెల పరశురాం, పల్ల అప్పన్న, గాడి రాజు, మామిడి జగదీశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా సమాధుల శ్రీను, ఎండ తౌడు, నేతల పెంటయ్య, తోలాపి సూరిబాబు, యామల గోపాల్, కోశాధికారిగా టి.సూరప్పడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుక్క ఆదినారాయణ, ప్రధాన సలహాదారులుగా గేదెల సురేష్ (మాస్టర్), జి రామారావు (మాస్టర్), సోషల్ మీడియా ప్రతినిధిగా ముక్కు రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గంలోనికి కుప్పిలి సీతప్పడు, దుంగ సూర్యనారాయణ, దత్తు గోవిందులను నామినేట్ చేయటానికి జిల్లా ప్రతినిధి అంగీకరించారు.


మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

కంకర తవ్వకాలు నిలుపుదల చేయాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్నలో పీర్లకొండ వద్ద కొంతమంది వ్యక్తులు అక్రమంగా కంకర తవ్వకాలు చేపట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని, బినామీ పట్టాలతో స్థలాలు ఆక్రమణకు పాల్పడుతున్నారని గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు డిటి శ్రీహరిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ అధికారి అనుమతి లేకుండా అక్రమంగా రాత్రి వేళలో కంకర తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారని తెలిపారు. గ్రామంలో చాలా మంది నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వార్డు కౌన్సిలర్ చిదిపోతు జగన్నాయకులు, బుగత జగన్, గిన్ని పాపయ్య, పీతాంబర రెడ్డి, ప్రేమ్ బిశాయి, ఢిల్లీ విశాయి, లంక జయరామ్, రాకేష్, కుర్మా, గిన్ని లోకేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

టిడిపి పూర్వ వైభవానికి కృషి

పలాస: టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్ అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో మండల కార్యకర్తలతో, నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని టిడిపి నాయకులు కలిసిమెలిసి పనిచేయాలని అన్నారు. టిడిపి ఓట్లను తొలగించేందుకు చూస్తున్నారని అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వైసిపి ప్రభుత్వం వల్ల రాష్ట్రం ఎంత నష్టపోయిందో, నాలుగున్నర ఏళ్లలో ఏ అభివృద్ధి చేశారో, యువతకు ఉద్యోగ అవకాశాలు ఎందుకు కల్పించలేకపోయారో తదితర అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. సమావేశంలో కుమార్, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

'లైన్ షోయింగ్'తో అధిక దిగుబడి

ఆమదాలవలస : మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా మండల యాంకర్ నక్క చిరంజీవి ఆధ్వర్యాన చోడి పంటను లైన్ షోయింగ్ విధానంలో నాట్లు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాగి పంటను సాధారణ పద్ధతి కంటే ఈ విధంగా లైన్ పద్ధతిలో నాట్లు వేసుకుంటే పంటలో మంచి దుబ్బులు వచ్చి అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి లేకుండా అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.


సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

జీతాల పెంపుపై హర్షం

పోలాకి: సెర్ప్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం 23 శాతం జీతాలు పెంపుదలపై హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు సోమవారం కృతజ్ఞతలు తెలుపుతూ సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ కొండలరావు, స్త్రీనిధి మేనేజర్ నాగరాజు, ఎపిఎం జి.రాజారావు, వైసిపి నాయకులు కణితి సత్తిబాబు, ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

ఎ-గ్రేడ్ తప్పనిసరి

కవిటి : మండలంలో ఉన్న అన్ని ఎస్‌హెచ్‌జిలు ఎ-గ్రేడ్‌లోనే ఉండాలని, అందుకు అనుగుణంగా విఒఎలు పనిచేయాలని ఎపిఎం గోవిందరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం విఒఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపిఎం మండలంలో లోన్ రికవరీ వంద శాతం ఉండాలని, అలాగే కొత్త సంఘాల ఏర్పాటు చురుగ్గా సాగించాలని సూచించారు. సున్నా వడ్డీకి సంబంధించి ప్రతి విఒఎ వద్ద పూర్తి సమాచారం ఉండాలని అన్నారు. రాము, సుహాసిని పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆమదాలవలస : పట్టణంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యాన మంగళవారం ఉచిత గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్య సాయి సేవా సంస్థల జిల్లా మెడికల్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.తాతయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పూజారిపేట రోడ్డులో ఉన్న ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో ఉచిత గుండె వ్యాధుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి విశాఖపట్నం అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ గుండె వ్యాధుల వైద్య నిపుణులు తెలికిచెర్ల రవికాంత్ హాజరుకానున్నట్లు చెప్పారు. అలాగే డాక్టర్ పి.సుభాష్ చంద్ర, డాక్టర్ పి.తాతయ్యలు కూడా పాల్గొంటారని అన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులను నిర్ధారణ చేసి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారని తెలిపారు. పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా వాకర్స్‌కు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బిపి, సుగర్ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నడకతో ఆరోగ్యం పెంపొందుతుందని అన్నారు. ప్రతిఒక్కరూ తమ దైనందన జీవితంలో నడకకు కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు గేదెల ఇందిరాప్రసాద్, పి.జి.గుప్త, ఎస్.సంజీవరావు, జి.వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, జె.సి.పట్నాయక్, డాక్టర్ జి.ఎన్.రావు, బి.వి.రవిశంకర్, పట్నాల రామారావు పాల్గొన్నారు.

ప్రకాష్ లేని లోటు పూడ్చలేనిది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర శ్రీశయన సంఘం మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు డి.వి.ఎస్.ప్రకాష్ లేని లోటు పార్టీకి పూడ్చలేనిదని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. నగరంలోని బలగలో ఉన్న శ్రీశయన సామాజిక భవనంలో ప్రకాష్ మూడో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా ప్రకాష్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అభివృద్ధికి ప్రకాష్ కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దొండపాటి నవీన్, శ్రీశయన సంఘం కేంద్ర అధ్యక్షులు వంగ మహేష్, జిల్లా అధ్యక్షులు మండల మన్మథరావు, ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శ్రీనివాసరావు, సంఘం ప్రచార కార్యదర్శి సాంగల ఈశ్వరరావు, సలపల ఆదినారాయణ, చీపురు రమణ పాల్గొన్నారు.

లోఓల్టేజి సమస్య పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సూదికొండ మరిడమ్మ, జంగాల వీధుల్లో తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, లోవోల్టేజి సమస్యతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారని వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్ట గోపి ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజి సమస్య పరిష్కారించాలని వార్డు మహిళలతో విద్యుత్‌శాఖ ఎఇఇ విద్యాసాగర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోవోల్టేజి సమస్యతో బోర్లు పని చేయడం లేదని, తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. లోవోల్టేజి సమస్య ఉందని పదేపదే చెబుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి లోవోల్టేజి సమస్య పరిష్కారించాలని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో వైసిపి నాయకుడు బగాది సింహాచలం, స్థానిక మహిళలు సుందరమ్మ, భాగ్యం, లత, రమణి, దుర్గమ్మ, దివ్య, అమీనా ధనలక్ష్మి, దాలమ్మ, రేణుక, నాగమణి, తులసి, దానమ్మ పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

మెళియాపుట్టి : మండలంలో పలు గ్రామాల్లోని పలువురిని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంతక్ష సోమవారం పర్యటించారు. సుందరాడకు చెందిన లక్ష్మణ్ ప్రధానో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలు పాలవడంతో ఆయనను, మెళియాపుట్టి సర్పంచ్ రేఖాన లక్ష్మమ్మ భర్త ఇటీవల అనారోగ్యం పాలవడంతో ఆయనను, కోటనందేస్ ఇటీవల అనారోగ్యం పాలవడంతో ఆయనను, పట్టుపురానికి పొట్నూరు మోహనరావు అనారోగ్యం పాలవడంతో ఆయనను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, సిద్ధిపాలెం గౌరీస్, గణేష్ ప్రధాన్, బోసి రామారావు, రేఖాన వాసు, సంపత్‌రావు సాయి, ఎస్.ఎల్లంనాయుడు, రవీంద్ర జన్నా, ఉర్లాన రుషి, శంకర్ బరోడా, కృష్ణ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : పరామర్శిస్తున్న శ్రీకాంత్

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు సిహెచ్.మురుగన్ బార్య రుక్మిణి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మృతిరాలు కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆమె చేపట్టిన విధుల్లో భర్తీ చేసేందుకు కుటుంబంలో ఒకరికి అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు డబ్బీర్ నాగు, శార్వాణి రవి, నేతాజీ ఉన్నారు.


పలాస: పరామర్శిస్తున్న చైర్మన్ గిరిబాబు